కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

శేరిలింగంపల్లి: గుల్‌మొహర్‌పార్క్ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని సోమవారం కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ ఖాసీం, కాలనీ అసోసియేషన్ నాయకులతో కలిసి విన్నవించారు. వరద నీటి పైప్‌లైన్లు, కాలనీలో దెబ్బతిన్న రోడ్లస్థానంలో సీసీ రోడ్లను నిర్మించాలని, పార్కులోని చిల్డ్రన్స్ ప్లే ఏరియాలో ఇసుకను వేయాలని కోరారు. అనంతరం జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం ఎలక్ట్రికల్ ఈఈని కలిసి పార్కులో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే మంజూరు చేసినట్లు ఖాసీం తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మోహన్‌రావు, ప్రభాకరాచారి, కమిటీ సభ్యులు షకీల్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్-21లో రేపటి నుంచి సర్వే



చందానగర్‌లో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ

చందానగర్: చందానగర్ సర్కిల్ -21 పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం సర్కిల్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సర్కిల్ 21 పరిధిలో 91,598 ఇళ్లు ఉన్నాయని, ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. బుధవారం నుంచి ఈ నెల 18 తేదీ వరకు 13 రోజుల్లో సర్వేను పూర్తి చేయాలన్నారు. మొదటి మూడు రోజులలో ఇంటి నంబర్, వివరాలను నమోదు చేసుకొని ఆ ఇంటికి స్టిక్కర్‌ను అతికించాలన్నారు. అనంతరం మిగతా 10 రోజులలో కుటుంబ సభ్యులందరి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం వివరాలు మార్గదర్శక పుస్తకంలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవిఎస్ రాజు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్ఓ డాక్టర్ రవి, ప్రాజెక్టు అధికారి ఉషారాణి, డీఈలు స్రవంతి, దుర్గా ప్రసాద్, ఏఈలు ప్రతాప్, ప్రశాంత్, సంతోష్‌రెడ్డి, పారిశుధ్య అధికారి శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏ, ఆర్పీలు, ఎంటమాలజీ, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి.. 12 వినతులు



డీసీ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణిలో ప్రజలు 10 ఫిర్యాదులు అందజేశారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు 5, ఇంజనీరింగ్ 1 ,శానిటేషన్, ఎలక్ట్రికల్ విభాగాలకు రెండు చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు కార్యక్రమంలో ఈఈ దుర్గాప్రసాద్, ఏఎంసీలు ప్రేమ్‌కుమార్, అర్బన్ బయోడైవర్సిటీ సర్కిల్ మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో..

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో 2 వినతి పత్రాలు అందాయి. రెండూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించినవి కావడంతో ఆ విభాగ అధికారులకు సమస్యలను పరిష్కరించాలని డీసీ ఆదేశించారు.

కార్తీక పూజలు



రాయదుర్గం: కార్తీకమాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని టెలికామ్‌నగర్‌లోని సాయదత్త గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయానికి ప్రత్యేకంగా తీసుకొచ్చిన స్ఫటిక శివలింగానికి అభిషేకం చేశారు .పూజా కార్యక్రమాలను టీటీడీ వార్షిక సత్కార పండితుల శైవాగమ ప్రతిష్టాచార్య తూర్పు గోదావరి జిల్లా ఆలమూరుకు చెందిన బ్రహ్మశ్రీ శైవాగమ వాచస్పతి కాళ్ళకూరి సూర్యశ్రీ చేతుల మీదుగా నిర్వహించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో, జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, గౌలిదొడ్డిలోని శివాలయంలో, ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ శ్రీ హనుమాన్ ధామ్ ఆశ్రమ్ ఆలయం, సాయిఐశ్వర్య కాలనీలో ముత్యాలమ్మ, శివాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకం అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

మియాపూర్‌లో..

మియాపూర్: మియాపూర్ మయూరీనగర్ కాలనీలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పూజలు ప్రారంభమయ్యాయి. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. చుట్టపక్కల కాలనీల ప్రజలు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు గంతల భృంగీశ్వర్, కార్య నిర్వహణాధికారి అరుణకుమారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





గంగారం పీజేఆర్ రోడ్డులో ప్రధాన కూడలి వద్ద మ్యాన్‌హోల్ నుంచి పొంగుతున్న మురుగు

మురుగు పొంగిపొర్లే..

రాకపోకలు ఎలా

ఏరులై పారుతున్న డ్రైనేజీ

- కనీసం రహదారిపై నడవలేని దుస్థితి
- పీజేఆర్ ఎన్‌క్లేవ్ ప్రాంతవాసుల అవస్థలు
- నెలల తరబడి సమస్య

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులో మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లుతున్నాయి. నెలల తరబడి రోడ్లపై డ్రైనేజీ పారుతున్నా పట్టించుకునే వారు లేరని స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై మురుగుతో పాటు దుర్వాసన.. అపర్ణహిల్ నుంచి వచ్చే వాహనాల రద్దీతో కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ఉన్న గంగారం చెరువులోకి మురుగు చేరుతోంది. మాధవపురి హిల్స్, కెఎస్ఆర్ లేఅవుట్ తదితర కాలనీల డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయి. మురుగు నీటి పైప్‌లైన్ కాలువ చిన్నదిగా ఉండడంతో రోడ్డంతా మురుగు పారుతుంది. పలు కాలనీలకు వెళ్ళే రోడ్లు దుర్గంధపూరితంగా మారాయి.దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని స్థానికులు కోరుతున్నారు. మాధవపురి హిల్స్ నుంచి వస్తున్న మురుగు నీటి పైప్‌లైన్ ప్రధాన కూడలి వద్ద మ్యాన్‌హోల్ నుంచి పొంగుతుంది. ఇప్పటికే పలుమార్లు అధికారులు పరిశీలించినా ఫలితం శూన్యం. పక్కనే ఉన్న దేవాలయాలకు వెళ్ళే భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.





అయ్యప్ప దేవాలయం వద్ద..

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



పీజేఆర్ ఎన్‌క్లేవ్‌కు వెళ్ళే మార్గంలో నెలల తరబడి రోడ్డుపై మురుగు పారుతుంది. సంబంధిత అధికారులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి. ఉదయం, సాయంత్రం సమయాలలో వాహనాల రద్దీ, రోడ్డుపై మురుగు నీటితో సమస్య వర్ణణాతీతం. – పవన్, స్థానికుడు

శాశ్వత పరిష్కారం చూపాలి



అపర్ణ హిల్‌పార్కు, మాధవపురి హిల్స్, హెచ్ఎంటీ హిల్స్‌కు వెళ్ళాలంటే డ్రైనేజీతో ఇబ్బందిపడుతున్నాం. నెలల తరబడి మురుగు నీటి సమస్యను పరిష్కరించడం లేదు. అయ్యప్ప ఆలయానికి వెళ్లాలంటే మురుగు నీటిలో నడుచుకుంటూ వెళ్ళాల్సి వస్తోంది. వెంటనే పరిష్కరించాలి.

– కమలాకర్ శర్మ

బైక్‌పై బాణాసంచా కాల్చిన కేసులో ముగ్గురు అరెస్ట్

- పాత వీడియోలుగా నిర్ధారణ
- మరో బైక్ కోసం గాలింపు

గచ్చిబౌలి: బైక్‌పై బాణాసంచా కాల్చిన కేసులో రాయదుర్గం పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కేటీఎం బైక్‌పై స్టంట్లు చేస్తూ బాణాసంచా కాల్చిన వీడియోలు ఇటీవల దీపావళి పండుగకు సంబంధించినవి కావని తేల్చి చెప్పారు. గత సంవత్సరం నవంబర్‌లో జరిగినదని ఆయన తెలిపారు. కేటీఎం బైక్‌పై స్టంట్లు చేసిన ఘట్‌కేసర్‌కు చెందిన షమీర్, ఇన్‌స్టాగామ్‌లో వీడియో పోస్టు చేసిన రామంతాపూర్‌కు చెందిన షాబాజ్, షమీర్ స్నేహితుడు కేటీఎం బైక్ యజమానిని అదుపులోకి తీసుకొని విచారించారు. ముగ్గురిని అరెస్ట్ చేశారు. గత సంవత్సరం షమీర్ ఇన్‌స్టాగామ్‌లో వీడియోను అప్‌లోడ్ చేశాడు. అదే వీడియోను షాబాజ్ డౌన్ లోడ్ చేసి తన ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. బైక్‌పై యువకుడు స్టంట్లు చేస్తుండగా వెనుక కూర్చున్న మరో వ్యక్తి టపాసులు కాల్చిన వీడియోను పోలీసులు గుర్తించారు. ఆ వీడియోలో ఉన్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 19 వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో జరుగుతున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతగా ఉండడంతో బాటు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



రైతుబజార్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి సూచించారు. సోమవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఉప కమిషనర్ సురేష్, అధికారులతో కలసి పర్యటించారు. రైతుబజార్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుబజార్, బొంబాయికాలనీలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించమన్నారు. కాగా ఎల్ఐజీ, బీడీఎల్ కాలనీ రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని పలువురు తన దృష్టికి తీసుకొచ్చారని, సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

రోడ్డుపై ఇసుక, కంకర.. ఇబ్బందులు



ఆలిండ్ ఎంప్లాయిస్ కాలనీ ప్రధాన రోడ్డులో ఇసుక, కంకర

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆలిండ్ ఎంప్లాయిస్ కాలనీ ప్రధానరోడ్డులో ఇసుక, కంకర మేటలతో వాహనదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ నెల 1వ తేదీన సాయంత్రం కురిసిన వర్షానికి వరదతో పాటు ఇసుక, కంకర సీసీ రోడ్డుపై చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఈ ప్రాంతంలో ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణపై కేంద్రం చిన్న చూపు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై చిన్న చూపు చూస్తోందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు.సోమవారం పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మెట్రో రైలు పొడగింపులో కేంద్ర ప్రభుత్వం వాటా18 శాతం మాత్రమే ఉందని, తెలంగాణ రాష్ట్రంను చిన్న చూపు చూడడం సరికాదన్నారు. టీపీసీసీ మాజీ కార్యదర్శి మతీన్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు యువరాజ్ మోరే, సాయిలు ముదిరాజ్, రతన్ సింగ్, అక్షిత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, వివిధ కాలనీలలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉస్మాన్ నగర్, ఉస్మాన్‌నగర్ పరిసర ప్రాంతాలు, ఎన్‌సీసీ, ఆనంద్ హోమ్స్, రాధే, సీఎంసీ, సురభి, ముప్పా, సైబర్‌కాలనీ, మైహోమ్ సాయుక్, ఏలియన్స్, మెడోస్ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆధ్యాత్మికతకు నిలయంగా..

- కార్తీకమాసంలో నిత్య పూజలు, మాలధారణ, అన్నప్రసాద వితరణ
- శబరిమలను తలపిస్తున్న శ్రీ ధర్మశాస్త ఆలయం

చందానగర్: 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ఆ ఆలయం మారుమోగుతోంది. శేరిలింగంపల్లి చందానగర్‌లోని గంగారం పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డులోని జగద్రక్షక శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. అయ్యప్పస్వాముల మాలాధారణ, విశేష పూజలతో అలరారుతోంది. కార్తీకమాసం అంటే అయ్యప్ప స్వాములకు నిలయం ఈ ధర్మశాస్త ఆలయం. 108 రోజులు పడి పూజలు, అభిషేకాలు, భక్తులతో దేవాలయం కిటకిటలాడుతుంది. స్వర్గీయ రాజ బహదూర్ నందగోపాల్‌నాయుడు గురుస్వామి ఆధ్వర్యంలో 2008లో ఆలయం నిర్మించారు. ఆయన మృతి చెందిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వి.రవి, కె.సత్యనారాయణ, జి.రాంచందర్, రామకృష్ణారెడ్డిలు ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఏకశిల పదునెట్టాంబడిని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు. 2019 కరోనా సమయంలో 60 సంవత్సరాలు పైబడిన వారికి శబరిమలకు అనుమతి లేకపోవడంతో సుమారు 823 మంది మాలధారులు ఈ ఆలయంలోనే ఇరుముడిని సమర్పించారు. స్వామి వారికి అభిషేకం చేసి దీక్ష విరమించారు. దసరా నుంచి జనవరి 4వ తేదీ వరకు ప్రతి సంవత్సరం 108 రోజులు అయ్యప్పస్వాములకు మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అల్పాహారం అందిస్తున్నారు.



మాలాధారణ చేస్తున్న గురుస్వామి



గంగారం పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న అయ్యప్ప ఆలయం



అయ్యప్ప మాలధారులకు అన్న ప్రసాద కార్యక్రమంలో ప్రసాదరావు గురుస్వామి


ఆలయంలో జరిగే విశేష పూజలు

ఉగాది పంచాంగం, శ్రీరామనవమి సుమారు 15 రోజుల పాటు, ప్రతి ఉత్తర నక్షత్రం రోజున అయ్యప్ప స్వామికి, సంకట చతుర్థి రోజు వినాయకుడికి అభిషేకాలు నిర్వహిస్తారు. కార్తీక మాసంలో మూడు రోజుల పాటు వార్షికోత్సవాలు, ఊరేగింపు నిర్వహిస్తారు.



దేవాలయంలో విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి (ఫైల్)

విరాళాల సేకరణ



ఆలయం కోసం చందాలు వసూలు చేయలేదు. స్వచ్ఛందంగా భక్తులు దేవాలయానికి వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. రానున్న రోజుల్లో దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి 'సప్తముఖ ఆంజనేయస్వామి' ఆలయాన్ని నిర్మిస్తున్నాం. అయ్యప్ప ఆలయం పూర్తిగా ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. మాలాధారణ చేసే వారు 51 రోజులు దీక్ష చేస్తే చాలా మంచిది.

– గురుస్వామి సత్యనారాయణ శివరామప్రసాదరావు

సీఎంఆర్ఎఫ్ మంజూరుపత్రం అందజేత



మంజూరు పత్రాన్ని బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్‌కి చెందిన రుబీనా బేగంకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన రూ.60 వేలు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను సోమవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యాగులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజు యాదవ్, రవీందర్ గౌడ్, కాశీనాథ్ యాదవ్, మల్లేష యాదవ్, మల్లేష్‌గౌడ్, శశాంక్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఛట్ పూజ.. ఏర్పాట్లు పరిశీలన

పటాన్‌చెరు టౌన్: యూపీ, బిహార్ రాష్ట్రాల ప్రజలు చేసుకునే ఛట్ పూజకు సాకి చెరువు వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ సాకి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నవంబర్ 7,8 తేదీలలో ఛట్ పూజలు జరుగుతాయని తెలిపారు.

24 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 24 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 24 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కరాటే జట్ల ఎంపిక



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో సోమవారం పురుషులు, మహిళల కరాటే జట్లు ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో జట్ల ఎంపిక జరిగింది. ఎంపికైన క్రీడాకారులు ఎల్ఎన్‌సిటీ యూనివర్సిటీ, భోపాల్, మధ్యప్రదేశ్‌లో నవంబర్ 16 నుంచి 20 వరకు జరిగే సౌత్ వెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డులో తలెత్తిన డ్రైనేజీ సమస్యను సోమవారం ఆయన సీవరేజీ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బకెట్ క్లీనింగ్ ద్వారా డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ వెంట సూపర్‌వైజర్ ఓం ప్రకాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకుడు నిరంజన్‌గౌడ్, సురేష్ ఉన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రైఫిల్ షూటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు కళాశాల ప్రిన్సిపల్ వెంకటయ్య వారిని సోమవారం అభినందించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -19 ఆధ్వర్యంలో సోమవారం గచ్చిబౌలిలో జరిగిన రైఫిల్ షూటింగ్ జిల్లా స్థాయిలో పోటీలలో కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సందీప్ మొదటి స్థానం, వివేక్ రెండవ స్థానం సాధించారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు.

భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పిఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 11న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్, బీహెచ్‌ఈఎల్ ఖాతాదారులు పాల్గొనాలని కోరారు.

సకాలంలో సర్వే పూర్తిచేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం చేపట్టిన సోషియో ఎకనామిక్ సర్వేపై సర్వే బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పాల్గొన్నారు. సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పట్టణంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన వేణుగోపాల్(40) ఆదివారం అర్ధరాత్రి బీరంగూడ నుంచి పటాన్‌చెరు వైపు బైక్‌పై వెళ్తున్నాడు. రామచంద్రాపురం గాంధీ విగ్రహం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన వేణుగోపాల్‌ను ప్రైవేట్ అనుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.